సాక్షి జగిత్యాల

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



ఘనంగా శివపురాణ సప్తాహం

జగిత్యాల: వేదపండితుడు విష్ణుశర్మ ఆధ్వర్యంలో శుభమస్తు గార్డెన్స్‌లో ఐదోరోజు శివపురాణ సప్తాహం ఘనంగా నిర్వహించారు.



ఆలయానికి రంగులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి రంగులు వేసే ప్రక్రియను శుక్రవారం సిబ్బంది ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం 33.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వివరాలు అప్‌లోడ్ చేయాలి

మల్లాపూర్(కోరుట్ల): జాతీయ పంచాయతీ అవార్డు సమాచారాన్ని మే 31లోగా అప్‌లోడ్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నరేశ్ సూచించారు. సిరిపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 జాతీయ అవార్డు సాధనపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంతోపాటు సిరిపూర్, నడికుడ గ్రామాల్లో ఎస్ఎస్‌జీ, ఓడీఎస్ ప్లస్, కాంపోనెంట్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పీకల్ స్లాడ్జ్ మేనేజ్‌మెంట్ తోపాటు కమ్యూనిటీ ఇంకుడుగుంతలపై గ్రామస్థాయి సిబ్బంది, వీవోఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధిహామీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, ఈజీఎస్ ఏపీవో సతీశ్, సర్పంచ్ భూక్య గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ జిల్లా అధ్యక్షుడిగా మహేంద్రాచార్య



మాట్లాడుతున్న మహేంద్రాచార్య

జగిత్యాల: ధూపదీప నైవేద్య అర్చక సమాఖ్య (డీడీఎన్) జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు మహేంద్రాచార్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక విద్యానగర్‌లోని సీతారామాలయంలో ధూపదీప నైవేద్య అర్చక సమాఖ్య సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అలువాల ఆత్మరాం, కోశాధికారిగా శ్యామ్‌సుందర్ ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు నారాయణ, ఆంజనేయ, మధుసూదనాచార్య, నారాయణరావు, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, మురళీకృష్ణ, గోవర్ధనశర్మ, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల హక్కుల సాధన లక్ష్యం



పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలక్రైం: గల్ఫ్ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామని తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ జేఏసీ నాయకుడు నరేంద్ర పన్నీరు అన్నారు. శుక్రవారం 'మృతిచెందిన వారిని స్మరించండ, బతికున్నవారి కోసం పోరాటం' నినాదంతో జిల్లాలో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన ప్రవాసీ కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఏడాదికి సుమారు 200 మందికిపైగా వివిధ కారణాలతో చనిపోతున్నారని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మోసం చేశారని అన్నారు. అనంతరం బీఎస్ రాములు నరేంద్ర పన్నీరు కూర్పు చేసిన భారత రాజ్యాంగం, ముఖ్యాంశాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'దళితబంధు అమలులో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: దళితబంధు పథకం అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షల –రూ.3 లక్షల వరకు కమీషన్లు తీసుకుంటున్నారని స్వయంగా సీఎం అంగీకరించారని అన్నారు. 2021–22లో ఒక్కో నియోజకవర్గానికి 1,500 దళితబంధు యూనిట్ల కోసం రూ.17,700 కోట్లు కేటాయించారని, కానీ నేటివరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని ఇంటిలిజెన్సీ ద్వారా ఆధారాలు సేకరించారని, అవినీతికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకునేందుకు సీఎం కేసీఆర్ ఎందుకు వెనుకాడుతున్నారని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు కూడా అవినీతికి పాల్పడితే ఏసీబీ చట్టం కిందకు వస్తాయని గుర్తుచేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేశ్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో వివాదం

- మళ్లీ పోస్టింగ్ ఇవ్వడంపై అనుమానాలు
- ఉన్నతాధికారిపై తీవ్ర ఆరోపణలు
- కలెక్టర్‌తోపాటు అధికారులకు ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు

'లాంగ్ లీవ్' ఉపాధ్యాయుడి తీరు కారణం

జగిత్యాల: ఎవరికీ చెప్పాపెట్టకుండా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లివచ్చిన ఓ ఉపాధ్యాయుడికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడంపై జిల్లా విద్యాశాఖలో తీవ్ర దూమారం రేపుతోంది. ఏకంగా ఉన్నతాధికారి తీరుపై తీవ్ర ఆరోపణలు చేస్తూ పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకూ ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

పట్టుందని బాధ్యతలు అప్పగిస్తే..

- జగిత్యాల డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు ప్రస్తుత జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో)నే డిప్యూటీ డీఈవోగా పనిచేశారు.
- జిల్లా విద్యాశాఖపై ఆయనకు పూర్తిస్థాయి పట్టు ఉందని చెబుతున్నారు.
- దీనిని ఆసరాగా చేసుకునే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయులు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు.
- సీసీఏ నిబంధనల ప్రకారం.. ఐదేళ్లకుపైగా అనాధికారిక సెలవుపై వెళ్తే ఆ ఉద్యోగికి నోటీసులు జారీచేయాలి. ఉద్యోగంలోంచి రిమూవ్ చేయాలి.
- ఈ నిబంధనను బేఖాతరు చేశారని డీఈవోపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- సుమారు ఇరవై ఏళ్లపాటు సెలవుపై వెళ్లిన ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులు ఎలాంటి నివేదిక ఇచ్చారు, మళ్లీ ఆయనకు పోస్టింగ్ ఎందుకు ఇచ్చారనే ప్రశ్నలు ఉపాధ్యాయుల నుంచి ఎదురవుతున్నాయి.
- జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 2016 నుంచి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడి నియామక ప్రక్రియపై అనేక ఆరోపణలు ఉన్నాయని, ఆయనకు చెల్లించే జీతభత్యాలపైనా విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.
- రెండేళ్లక్రితం జగిత్యాల బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు.. రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. పోలీస్ విచారణలో ఆమె బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ నుంచి బీఈడీ ఫేక్ సర్టిఫికెట్ తీసుకొచ్చారని, అందుకే ఆమెను విధుల్లోంచి తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినా చర్యలు తీసుకోలేదని కూడా డీఈవోపై ఆరోపణలు వస్తున్నాయి.
- అర్హతలేని ఉపాధ్యాయురాలితో విద్యాబోధన చేయించడం ప్రభుత్వాన్ని మోసం చేయడమేనని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదని పేర్కొంటున్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఫిర్యాదుల వెల్లువ

- డైట్‌లోని ఓ జూనియర్ లెక్చరర్‌కు జిల్లా విద్యాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించే వీలుందని, కానీ, పూర్తిస్థాయి డీఈవో బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ఎస్టీయూ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఇంకా అనేక ఆరోపణలు..

- జిల్లాలో కొత్త ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించడం, గుర్తింపు ఇవ్వడం, రెన్యూవల్ చేయడంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగి తమను వేధిస్తున్నారని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ప్రతీ పాఠశాలకు ఐదేళ్లవరకు రెన్యూవల్ గడువు ఉంటుందని, కానీ కొన్నింటికి పదేళ్ల వరకూ రెన్యూవల్ గడువుతో ఉత్తర్వులు జారీచేస్తున్నారని వివిధ సంఘాలు అంటున్నాయి.
- ఉపాధ్యాయుల సర్దుబాట్ల ప్రక్రియలో నిబంధనలు అతిక్రమిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఎస్సెస్సీ– 2023 పరీక్ష విధుల్లో భాగంగా సీఎస్‌డీవోలుగా సీనియార్టీలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు విధులు కేటాయించారని ఉపాధ్యాయుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధం

నిబంధనలకు విరుద్ధంగా 20 ఏళ్లపాటు విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడికి సీసీఏ నిబంధనలు అతిక్రమించి పోస్టింగ్ ఇచ్చారు. జీవో 317 అమలు చేయలేదు. నేరుగా పోస్టింగ్ ఎలా ఇస్తారు? పూర్తిస్థాయిలో విచారణ జరపాలి.

– భైరం హరికిరణ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

విచారణ జరపాలి

విద్యాశాఖ కార్యాలయంలోని కొందరు అధికారుల తీరుతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసులో అక్రమాలు జరుగుతున్నాయి. ఉపాధ్యాయుల సర్దుబాట్లలో మహిళలు ఇబ్బందులకు గురయ్యారు.

– మచ్చ శంకర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉన్నతాధికారుల ఆదేశాలతో



రాయికల్ మండలం తాట్లవాయి పాఠశాల ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్ 2003 వరకు ఎస్జీటీగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత గైర్హాజరయ్యారు. ఇటీవల ఉన్నతాధికారులు జారీచేసిన ఉత్తర్వుల మేరకు ఆయనకు మళ్లీ పోస్టింగ్ ఇచ్చాం. నా ప్రమేయం ఏమీలేదు. విద్యాశాఖలో అవకతవకలకు చోటులేదు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

మళ్లీ వాన.. అన్నదాత అరిగోస



జగిత్యాల మండలం వెల్దుర్తిలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్ కప్పుతున్న అన్నదాతలు

- తడిసి ముద్దయిన ధాన్యం
- రాలిన మామిడికాయలు

జగిత్యాలరూరల్: అకాల వర్షాలు అన్నదాతలను వెంటాడుతూనే ఉన్నాయి. శుక్రవారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసి పంటలను తీవ్రంగా నష్టపర్చింది. ఒకవైపు ఈదురుగాలులు, వర్షాలతో చేతికందిన పంట నీళ్లలో కలిసిపోవడంతో అన్నదాత కన్నీరుపెడుతున్నాడు. జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి, వెల్దుర్తి, కండ్లపల్లి, పొరండ్ల, నర్సింగాపూర్, అర్బన్ మండలం ధరూర్, మోతె, తిప్పన్నపేట, హస్నాబాద్ గ్రామాల్లో భారీవర్షం కురిసింది. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై రైతులు ధాన్యం కవర్లు కప్పుతూ నానాఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడికాయలు నేలరాలడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరి, నువ్వు పంటలు కూడా దెబ్బతిన్నాయి.



బుగ్గారంలో నీటిపాలైన ధాన్యం



బుగ్గారం : కొనుగోలు కేంద్రంలో నీటిపాలైన ధాన్యం



వెల్గటూర్ : ధాన్యంలోకి చేరిన వర్షపునీరు

నీటమునిగిన ధాన్యం

వెల్గటూర్(ధర్మపురి): వివిధ గ్రామాల్లో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన భారీవర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం నీటమునిగింది. మరికొంత వరదలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా ఒకట్రెండు తప్ప మిగతా కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలన్నీ ధాన్యం కుప్పలతో నిండిపోయాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. వర్షాలతో మరోమూడు రోజుల వరకూ ధాన్యం కొనుగోలు ప్రారంభించే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు.

కొట్టుకుపోయిన ధాన్యం

బుగ్గారం(ధర్మపురి): పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం నీటిపాలైంది. చదునుచేసిన స్థలం లేకపోవడం, కనీస వసతులు కల్పించకపోవడంతో ఒక్కసారిగా వచ్చిన వరద ధాటికి ధాన్యం నీటిపాలైంది. వందల క్వింటాళ్ల ధాన్యం నీటిప్రవాహంలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు గుండెలు పట్టుకుని విలపించారు. సుమారు 20 మంది రైతుల ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. దాదాపు రెండు లారీల లోడ్‌ల ధాన్యం నీటిపాలైందని అన్నదాతలు ఆవేదన చెందారు. పొలాల్లోని వరిపైరు పూర్తిగా నేలకొరిగింది. మరోవైపు.. ప్రజాప్రతినిధులు, సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం నష్టంపై అంచనాలు వేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎంస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంసీసీ అధ్యక్షుడు వేముల సుభాష్ తదితరులు బాధిత రైతులను పరామర్శించి పంట నష్టంపై ఆరా తీశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులకు విన్నవిస్తామని వారు హామీ ఇచ్చారు.

క్రమబద్ధీకరించే వరకూ సమ్మె

- పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి
- నిరవధిక సమ్మెలో జూనియర్ సెక్రటరీలు



జగిత్యాలలో పంచాయతీ కార్యదర్శుల నిరసన

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించే వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల సేవలు మరువలేనివన్నారు. అయినా, తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని విమర్శించారు. తమను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ వనజ, పంచాయతీ కార్యదర్శులు మహేశ్, రాఘవ్, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

'సారూ.. మా ఆవేదన వినండి'

మల్లాపూర్(కోరుట్ల): 'కేసీఆర్ సారూ.. మా ఆవేదన వినండి' అని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రవళి విన్నవించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. దీంతోనే తాము సమ్మె చేస్తున్నామని తెలిపారు. వెంటనే తమను క్రమబద్ధీకరిస్తూ జీవో విడుదల చేయాలన్నారు. నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించాలన్నారు. తమ కుటుంబాల కోసం కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైనవారికి ప్రమోషన్లు ఇచ్చి 317 జీవోతో నష్టపోయినవారికి న్యాయం చేయాలని విన్నవించారు. పరస్పర, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించి, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కార్యదర్శులు రవీందర్, ప్రవీణ్, వినోద్, నరేశ్, సాయికృష్ణ, సంతోషిణి, సదస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమతో ముప్పే..



పర్లపల్లి ఇథనాల్ పరిశ్రమ వద్ద గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో సమీపంలోని ఐదారు గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లిలోని ఇథనాల్ పరిశ్రమను శుక్రవారం రెండు గ్రామాల ప్రజలు సందర్శించారు. పరిశ్రమతో కలిగే లాభాలు, దుష్పరిణామాలు, పరిశ్రమ ఏర్పాటయ్యాక ప్రస్తుత పరిస్థితులపై పర్లపల్లి గ్రామస్తులను వారు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ ఏర్పాటుతో అనేకమందికి ఉద్యోగాలు లభిస్థాయని ఆశపడి గ్రామ పంచాయతీ ద్వారా అనుమతులు ఇచ్చామని, కానీ ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదని అక్కడి గ్రామస్తులు ఆవేదన చెందారు. పైగా పరిశ్రమ నుంచి వెలువడే దుర్గంధం చాలాదారుణంగా ఉంటోందని, వర్షాకాలంలో తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పరిశ్రమను ఏర్పాటు చేయొద్దన్నారు.

పీఎంశ్రీకి ఎంపికైన ఇటిక్యాల మోడల్ స్కూల్

- 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యం పెంపు లక్ష్యం



ఇటిక్యాల మోడల్‌స్కూల్

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల తెలంగాణ మోడల్ స్కూల్ పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన జాబితాలో ఇటిక్యాల మోడల్ స్కూల్ ఉందన్నారు. దీనికింద పాఠశాలలకు అనేక సౌకర్యాలు కల్పిస్తారన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రత్యేక బోధనా పద్ధతులు అవలంబించి ప్రయోగ ఆధారిత అభ్యసనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందిస్తారని తెలిపారు. నాణ్యమైన, వినూత్నమైన అధునాతన అభ్యాసం దరిచేర్చుతారని చెప్పారు. ప్రత్యేక వార్షిక పాఠశాల గ్రాంట్లు అందిస్తారన్నారు. విద్యార్థినులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తారని, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి తెస్తారని వివరించారు. ఇప్పటికే ఉన్న సదుపాయాలను మరింత మెరుగుపర్చుతారని అన్నారు. ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక విధానం అవలంబిస్తారన్నారు. సైన్స్ ల్యాబ్‌లు, ఐసీటీ సౌకర్యాలు, వొకేషనల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తారన్నారు. పాఠశాల ఆవరణలో సోలార్ ప్యానెళ్లు, ఎల్‌ఈడీ లైట్లు, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, మొక్కల పెంపకం వంటివి చేపట్టి సుందర, హరిత పాఠశాలగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. మొత్తంగా 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తారని అన్నారు. పీఎంశ్రీకి స్కూల్ ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కారోబార్లకు కష్టాలే..

- అత్తెసరు వేతనాలు.. కానరాని గుర్తింపు
- పీజీ చదివినా.. పారిశుధ్యం పని చేయాల్సిందే
- మే 5వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కారోబార్.. అంటే గ్రామ పంచాయతీకి ఆల్‌రౌండర్. ఇంటి పన్నులు, రికార్డుల నిర్వహణ, సమాచారం, జనన–మరణాల నమోదు, పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, తాగునీరు, పారిశుధ్యం, మురుగు నిర్వహణ, డ్రైవింగ్, మెకానిక్, వీధిదీపాలు.. ఒకటేమిటి.. పంచాయతీ పరిధిలో దాదాపు 30కిపైగా విధులు నిర్వహిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతీ గ్రామ పంచాయతీకి వీరు ఆరో ప్రాణం. అంతటి ప్రాధాన్యమున్న కారోబార్, పంచాయతీ సిబ్బంది తమకు కనీస వేతనాలు, హక్కుల కోసం సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే సమ్మె నోటీసులను ఆయా జిల్లాల్లో పంచాయతీ అధికారులకు అందజేశారు.

అసలేంటి విధానం?

గ్రామ పంచాయతీలో వివిధ పనుల నిర్వహణకు స్థానికులను గతంలో కారోబార్‌లుగా నియమించుకుంది. వీరిని పంచాయతీ తీర్మానం ద్వారా విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా వీరిని చేర్చుకునేవారు. ఉదాహరణకు డిగ్రీ ఆపైన చదివిన వారికి బిల్ కలెక్టర్, రికార్డుల నిర్వహణ వంటి పనులు, డ్రైవింగ్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్ పని తెలిసిన వారికి అవే ఉద్యోగాలు, మిగిలిన వారిని సఫాయి కార్మికులుగా నియమించుకునేవారు. వీరిలో రికార్డుల నిర్వహణ, బిల్లుల వసూలు, సమాచార సేకరణ వంటి రాతపనులు చూసేవారిని కారోబార్‌లుగా, మిగిలిన వారిని సిబ్బందిగా పిలిచేవారు.

- ఇదే క్రమంలో 2019లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లను నియమించుకుంది. అదే సమయంలో ప్రభుత్వం జీవో నెం.51 విడుదల చేసింది. దీని ప్రకారం.. గ్రామ పంచాయతీలో పనిచేసే సిబ్బందిని మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ)గా నామకరణం చేసింది. ఏ పనిచెబితే ఆ పని చేయాల్సి ఉంటుంది.
- ప్రతీ గ్రామానికి ఐదుగురు చొప్పున వీరిని నియమించారు. ఒకప్పుడు రూ.2,000 నుంచి రూ.3,000లకు పనిచేసిన వీరికి జీవో నెం.51 కారణంగా రూ.8,500 చొప్పున వేతనం ఇచ్చేవారు. ప్రతీ 500 మందికి ఒక కారోబార్ ఉండాలన్న నిబంధన తీవ్ర ప్రతికూలంగా మారింది.



మానకొండూర్: సమ్మెనోటీసు ఇస్తున్న కార్మికులు

వెయ్యి జనాభా ఉన్న గ్రామంలో ఐదుగురు కారోబార్‌లు ఉంటే అందులో కేవలం ఇద్దరికే రూ.8,500 చొప్పున ఇస్తారు. దాన్నే అంతా పంచుకోవాల్సిన దుస్థితి. డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు మరణించినా.. వారి కుటుంబాలకు పరిహారం దక్కడం లేదు.

- ప్రస్తుతం దాదాపుగా అన్ని గ్రామాల్లో కారోబార్‌లు జేపీఎస్‌లకు సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. అలా కుదరని పక్షంలో జీవో 51 ప్రకారం.. డిగ్రీ, పీజీలు చదివినా సరే డ్రైవింగ్, ప్లంబింగ్, చివరికి సఫాయి కార్మికునిగా కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 30 ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు ఎప్పటికైనా మంచి భవిష్యత్తు దక్కుతుందన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా	గ్రామ పంచాయతీలు	సిబ్బంది	కారోబార్‌లు
కరీంనగర్	330	1,252	245
జగిత్యాల	414	1,651	326
పెద్దపల్లి	315	1,254	214
సిరిసిల్ల	262	1,035	223

వీరి డిమాండ్లు ఏంటి?

- గతంలో కారోబార్లుగా వ్యవహరించిన అందరినీ జేపీఎస్‌లకు సహాయకులుగా అధికారికంగా నియమించాలి. వీరికి గ్రామ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పిస్తూ.. రూ.21,500 వేతనం అందించాలి.
- 500 ఒక కారోబార్ కాకుండా.. గ్రామపంచాయతీలో ఇప్పటికే పనిచేస్తున్న కారోబార్లందరికీ రూ.15,500 చొప్పున వేతనాలు ఇవ్వాలి.
- కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.
- జీవో నెం.51కు కారోబార్లు సిబ్బంది సమస్యలకు అనుగుణంగా సవరణలు చేయాలి.
- కారోబార్, సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సదుపాయం కల్పించాలి.
- సిబ్బందిలో ఎవరు ప్రమాదవశాత్తు మరణించినా వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.

వెంటనే ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 51 కారణంగా కారోబార్లు, సిబ్బంది అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మల్టీపర్పస్ వర్కర్ పేరిట అందరినీ దాదాపుగా సఫాయి కార్మికులుగా చూస్తున్నారు. విధినిర్వహణలో మా ప్రాణాలు పోయినా.. పరిహారం కూడా అందడం లేదు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలి.

– బింగి గణేశ్, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది యూనియన్

క్లుప్తంగా

జిల్లా మొదటి అదనపు జడ్జిగా నారాయణ



జిల్లా అదనపు జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

జగిత్యాల జోన్ : జిల్లా మొదటి అదనపు జడ్జిగా ఎస్.నారాయణ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు జడ్జి నారాయణను శుక్రవారం మర్యాదపూర్వకంగా జగిత్యాల బార్ అసోసియేషన్‌కు ఆహ్వానించి, పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమా మాట్లాడుతూ, కోర్టు బెంచ్‌కు న్యాయవాదులు ఎప్పటికప్పుడు సహకరిస్తే, అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కారమవుతాయని చెప్పారు. బదిలీపై వచ్చిన అదనపు జిల్లా జడ్జి నారాయణ మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించి, న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలన్నారు. కార్యక్రమంలో సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి అధికారులతో ఇబ్బందులు

- ఏవోకు 35వ వార్డు కౌన్సిలర్ వినతి

జగిత్యాల : మున్సిపల్‌లో కమిషనర్, డీఈలు ఇన్‌చార్జిలుగా ఉండటంతో ఇబ్బందికరంగా ఉందని, రెగ్యులర్ పోస్టులను నియమించాలని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కమిషనర్, డీఈలు కలెక్టరేట్‌లోనే ఉంటూ పనిచేయడంతో ఇబ్బందికరంగా మారిందని, మున్సిపల్ కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో శానిటేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో అవినీతికి తెరలేస్తుందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖాతాలోంచి రూ. 94 వేలు మాయం

కథలాపూర్ (వేములవాడ): సైబర్ నేరగాడి చేతిలో మరో వ్యక్తి మోసపోయాడు. మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఈనెల 3న అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్‌కార్డు ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పాడు. అందుకు సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్ క్లిక్ చేయాలని చెప్పడంతో అది నమ్మిన యువకుడు లింక్ క్లిక్ చేశాడు. కొన్ని నిమిషాల్లోనే అతని ఖాతాలోంచి రూ. 94,231 మాయమయ్యాయి. మోసపోయాయని తెలుసుకున్న యువకుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మే నెలలో ఉచిత బియ్యం పంపిణీ

- జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారి రజినీకాంత్

జగిత్యాలరూరల్ : ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలో మే నెలకు సంబంధించి ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారి రజినీకాంత్ తెలిపారు. మే 4 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ బియ్యం పంపిణీ చేయాలన్నారు.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం

బుగ్గారం(ధర్మపురి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని మాతాశిశు సంరక్షణాధికారి జైపాల్ రెడ్డి సూచించారు. ధర్మపురిలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆశవర్కర్లు, ఏఎస్ఎంలు, వైద్య సిబ్బందితో వైద్యసేవలపై సమీక్షించారు. 102 వాహనం రూట్‌మ్యాపు పరిశీలించారు. దానిద్వారా అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ కిట్ల వివరాలపై ఆరా తీశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సూపరింటెండెంట్ నవీన్, వైద్యులు అవంతి, శిరీష, మానస, శ్రీకాంత్, హెచ్ఈవో రాజేశం పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వడగండ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వానలతో పంటలు పూర్తిస్థాయిలో తుడిచిపెట్టుకుపోయాయన్నారు. ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. లింగంగౌడ్,గంట బుచ్చాగౌడ్, రాంరెడ్డి, బానోతు రాజు పాల్గొన్నారు.

మక్కల కొనుగోళ్లకు సిద్ధం

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- జిల్లాలోని మార్కెట్‌యార్డుల్లో కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- 16.52 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా



ధరలేక ఇంట్లో నిల్వచేసిన మొక్కజొన్న కంకులు

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న. రాత్రింబవళ్లు కష్టపడగా యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న పంట రైతుల చేతికి అందింది. పండిన పంటను ఆరబెట్టి అమ్ముకుందామంటే, ఓ వైపు అకాలవర్షాలు, సరైన ధర రాక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు మక్కలను కొనుగోలు చేసే ప్రభుత్వం మొన్నటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం, తాజాగా సీఎం కేసీఆర్ మొక్కజొన్న కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, జిల్లా అధికార యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. మరో నాలుగైదు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 55,087 ఎకరాల్లో పంటసాగు

జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 55,087 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. వ్యవసాయాధికారులు ఎకరానికి సగటున 30 క్వింటాళ్ల చొప్పున, 16.52 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న వస్తుందని అంచనా వేశారు. అయితే, నెల క్రితం మొక్కజొన్నకు ఓపెన్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2300 వరకు ధర ఉండటంతో, పంట ముందు వచ్చిన రైతులు ఇప్పటికే సగం అమ్ముకున్నారు. దీనికి తోడు, అకాలవర్షాలు కురుస్తుండటంతో పంట కొంతమేర దెబ్బతింది. ప్రస్తుతం, జిల్లాలో రైతుల వద్ద మిగిలిన 7–8 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నను విక్రయించే అవకాశం ఉంది. ఈసారి వానాకాలంలో వరిపంట సాగుచేసిన పొలాల్లో మొక్కజొన్న పంట వేయడంతో ఈ సారి కొంతమేర దిగుబడులు పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మొన్న రూ.2500, ఇప్పుడు రూ.1700

మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1962. అయితే, మొన్నటి వరకు ప్రభుత్వ మద్దతు ధరను మించి క్వింటాల్‌కు రూ.2500 వరకు ధర పలికింది. ఇప్పుడు, యాసంగి మొక్కజొన్న రైతుల చేతుల్లోకి పంట రాగానే, ధర అమాంతం రూ.800- 900 పడిపోయి, ఇప్పుడు రూ. 1700కు చేరింది. ప్రభుత్వ మద్దతు ధరతో చూస్తే రైతులు క్వింటాల్‌కు రూ.262 వరకు నష్టపోవాల్సి వస్తోంది. దీంతో, వ్యాపారులు పెడుతున్న రేటును బట్టి, జిల్లా రైతులకు ప్రభుత్వ ధరతో పోల్చితే దాదాపు రూ.15–16 కోట్ల వరకు నష్టం జరుగనుంది.

మార్కెట్‌యార్డుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

ప్రభుత్వ ఆదేశాలతో మార్క్‌ఫెడ్ సంస్థ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రెండేళ్లుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో, ప్రస్తుతం, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, కొనుగోలు సిబ్బంది, రవాణా, నిల్వ చేసేందుకు గోదాంల పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. జిల్లాలో మొక్కజొన్న ఎక్కువగా సాగు చేసే మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, జగిత్యాల, గొల్లపల్లి, ధర్మపురి, మేడిపల్లి, కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి వంటి చోట్ల దాదాపు 10 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. జిల్లాలో మరెక్కడైనా రైతుల నుంచి డిమాండ్ ఉంటే అక్కడ ఏర్పాటు చేసేందుకు మార్కెట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయి తే, ప్రభుత్వం నుంచి లిఖితపూర్వకంగా ఆదేశాలు రాగానే మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో మార్కెఫెడ్ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

రైతులకు ప్రభుత్వ అండ



మొక్కజొన్న రైతులు ఇబ్బందులు పడుతుండటంతో, ప్రభుత్వం కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. అవసరమైన చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం కొనుగోలుతో ఒక్కో క్వింటాల్‌కు రూ.260 వరకు లాభం రానుంది.

– ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జగిత్యాల

కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం



ప్రభుత్వం నుంచి కొనుగోళ్లకు సంబంధించిన లిఖిత పూర్వక ఆదేశాలు రాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు, కలెక్టర్ సూచనల ప్రకారం ప్రజాప్రతినిధుల సహకారంతో మొక్కజొన్న ఎక్కువ ఉన్న చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

– దివ్యభారతి, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి, జగిత్యాల

బీసీల బలోపేతానికి కృషిచేయాలి



ఆర్ కృష్ణయ్యను సన్మానిస్తున్న శికారి గోపి

కోరుట్ల : జిల్లాలో బీసీల బలోపేతానికి కృషి చేయాలని బీసీ సంఘం తెలంగాణ కార్యదర్శి శికారి గోపి కృష్ణా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ .కృష్ణయ్యను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా శికారి గోపి మాట్లాడుతూ.. జనాభాలో 70 శాతానికి పైగా ఉన్న బీసీలకు సరైన గుర్తింపు దక్కడం లేదన్నారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, తెలంగాణ సంయుక్త కార్యదర్శి తుమ్మనపల్లి రాజేంద్రప్రసాద్, అల్లె జగదీశ్వర్, అనంతయ్య పాల్గొన్నారు.

నియామకం



రవీందర్ రెడ్డి

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి పౌల్ట్రీ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైనట్లు ఆ సంఘం నాయకులు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... పౌల్ట్రీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రవీందర్ రెడ్డిని గ్రామంలో ఘనంగా సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచులు సమన్వయం పాటించాలి

- ఎంపీపీ కోల జమున
- బిల్లులు రావడం లేదని సర్పంచులు మండల సభకు గైర్హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సారంగాపూర్ : సర్పంచులు సమన్వయం పాటించాలని ఎంపీపీ కోల జమున అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని 18 గ్రామాల సర్పంచులు గ్రామాల్లో చేసిన పల్లెప్రగతి, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రావాల్సి ఉందని, బిల్లులు రాకపోవడంపై నిరసన తెలుపుతూ సభకు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సర్పంచులకు సకాలంలో ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడం బాధకరమేనని బిల్లులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులు చేసిన పనులకు బిల్లులు చేసి, సంబంధిత శాఖలకు ఎప్పటికప్పుడు నివేదించారని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్ మాట్లాడుతూ.. అర్పపల్లి గొల్లవాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేయాలని గత సమావేశంలో కోరినప్పటికీ ఇప్పటికీ దీనిపై ఎలాంటి పురోగతి లేదన్నారు. రేచపల్లి ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య రాథోడ్ మాట్లాడుతూ.. అకాలవర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతుందని, రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. రంగపేట, ఒడ్డెరకాలనీల్లో కొనసాగిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈసారి రద్దు చేశారని, వెంటనే సింగిల్‌విండో ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. విండో అధ్యక్షుడు ఏలేటి నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ఐకేపీ కేంద్రాల్లో కమిటీలు ఏర్పాటు చేసే సమయంలో ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మ్యాడారం తండాకు వచ్చే మిషన్‌భగీరథ పైప్‌లైన్లు నుంచి నీరు లీకేజై వృథా పోతుందని ఎంపీటీసీ లావణ్యరాథోడ్ అన్నారు. ఆయా శాఖల అధికారులు పాల్గొని సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఎంపీడీవో రాజేందర్, జెడ్పీటీసీ సభ్యుడు మేడిపల్లి మనోహర్ రెడ్డి , అధికారులు, ఎంపీటీసీ సభ్యురాలు ఏలేటి మమత తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

- జగిత్యాల ఇన్‌చార్జి డీఎస్పీ రవీందర్ రెడ్డి



దొంగల అరెస్ట్ చూపుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ

జగిత్యాల క్రైం: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జగిత్యాల ఇన్‌చార్జి డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లికి చెందిన వడ్లూరి నాగరాజు, మల్యాల మండలం నూకపల్లి అర్బన్ కాలనీకి చెందిన ఎండీ అక్తర్ అలియాస్ అబ్దుల్ రషీద్, టీఆర్‌నగర్‌కు చెందిన ఎండీ ఖలీద్ పాత నేరస్తులన్నారు. శుక్రవారం ఉదయం జగిత్యాల పట్టణ ఎస్సై రహీం ఆధ్వర్యంలో మంచినీళ్ల బావి వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పందంగా కనిపించడంతో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారించగా ఆరు ద్విచక్రవాహనాలు, ఆటో దొంగిలించినట్లు ఒప్పుకున్నారన్నారు. వీరినుంచి ఐదు ద్విచక్రవాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వేములవాడ పీఎస్ పరిధిలో ఓ ద్విచక్రవాహనం, ఓ ఆటో, ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనం, మిగతా పట్టణపోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. టౌన్ సీఐ రాంచందర్‌రావు, ఎస్సై రహీం, సంజీవ్, మల్యాల ఎస్సై చిరంజీవిను అభినందించారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

బుగ్గారం (ధర్మపురి): నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా మూడో రోజైన శుక్రవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయం పంచోపనిషత్తులతో అభిషేకాలు, స్థాపిత దేవతాపూజలు, కలశస్థాపన పూజలు, తులసీ అర్చన తదితర క్రతువులు వేదపండితుల, అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో స్వామివారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అధికారులు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో రెనవేషన్ కమిటీ చైర్మన్ రామయ్య, ఈవో శ్రీనివాస్, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి వలస జీవి మృతదేహం

గొల్లపల్లి : మండలంలోని శ్రీ రాములపల్లికి చెందిన ఒరుగంటి రాజయ్య మస్కట్‌లో మృతిచెందగా పదిరోజుల తర్వాత మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామానికి చెందిన రాజయ్య 15 ఏళ్ల నుంచి మస్కట్‌కు వెళ్తూ ఓ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం పనిచేస్తున్న కంపెనీ వద్ద స్పృహతప్పి పడిపోయాడు. కంపెనీ వర్కర్లు వెంటనే చికిత్స నిమిత్తం అక్కడ ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పది రోజుల అనంతరం మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకురాగా సర్పంచ్ నేరెళ్ల గంగారెడ్డి విషయం మంత్రి ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా ఎయిర్‌పోర్టు నుంచి స్వగ్రామానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. మృతుడి భార్య రాజవ్వ గ్రామ పంచాయతీలో సఫాయిగా పనిచేయగా, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్పంచ్ గంగారెడ్డి దహన సంస్కారాల కోసం రూ.5 వేలు అందించారు.

నెలరోజులు గడుస్తున్నా ధాన్యం కొనరా?

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గొల్లపల్లి మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి దాదాపు నెలరోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు ప్రక్రియ మొదలు కాలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గొల్లపల్లి మార్కెట్‌యార్డులో వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. గొల్లపల్లి మార్కెట్‌యార్డును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గంలో రైతులకు మేలు చేసే విధంగా మార్కెట్ యార్డు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాలకవర్గం ఉండాలన్నారు. మార్కెట్‌యార్డులో పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక గ్రామాల్లో ఐకేపీ సెంటర్ల పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు 3–4 కిలోల తాలు, తప్ప పేరిట కట్ చేస్తున్నారని, అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి మొలకలు వస్తే మంత్రి ఆవైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి నాలుగు రోజుల్లో వడ్ల కొనుగోళ్ల సమస్య పరిష్కరించి కొనుగోళ్లను చేపట్టాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, సర్పంచులు చిర్ర గంగాధర్, సత్యనారాయన, ఎంపీటీసీ లంబ దనవ్వ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయని, ఫ్లోరింగ్, డోర్ల బిగింపు తదితర పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం నూకపల్లిలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రగతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, పనుల్లో కొంత జాప్యం జరుగుతోందన్నారు. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె వెంట పీఆర్ ఈఈ రహమాన్, డీఈ రాజేశ్వర్ ఉన్నారు.

వ్యవసాయ న్యాయ సేవా కేంద్రం ప్రారంభం



న్యాయసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి నిహారిక

కోరుట్ల రూరల్ : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ న్యాయ సేవా కేంద్రాన్ని కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక ప్రారంభించారు. ఈ కేంద్రంలో గ్రామానికి చెందిన ఏడుగురు రైతులను చేర్చి వారికి శిక్షణను ఇచ్చి గ్రామంలో రైతులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్ది నర్సయ్య, సెక్రటరి విజయ్, ఉపాధ్యక్షుడు సురేశ్, ఏజీపీ రాజేంద్ర ప్రసాద్, చాప కిషోర్, రాజశేఖర్, ప్రేమ్, ఫసియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జెండా గద్దె కూల్చడం సరికాదు

వేములవాడ : మే డే కార్మిక దినోత్సవాన్ని జరుపుకునేందుకు మున్సిపల్ కార్యాలయం ముందు ఓ గద్దె నిర్మించుకుంటామని మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అనుమతి పత్రం ఇవ్వకపోవడంతో చిన్న గద్దె కట్టిన తర్వాత మున్సిపల్ అధికారులు దాన్ని కూల్చేయడం సరికాదని సీపీఐ జిల్లా నాయకుడు కడారి రాములు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో లే-అవుట్ స్థలాలు, అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకుండా కార్మికులు ఉత్సవాలు జరుపుకునే గద్దె నిర్మించుకుంటే మున్సిపల్ అధికారులకు ఆక్రమణలుగా కనిపిస్తున్నాయంటూ రాములు మండిపడ్డారు. తమ గద్దె నిర్మాణాన్ని అడ్డుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

కుల బహిష్కరణ చేసిన 12 మంది పై కేసు

రాయికల్ : మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బోయిని గంగారం అతని కుటుంబాన్ని గ్రామంలోని ఎస్సీ మాదిగ, దప్పు సంఘం నుంచి బహిష్కరించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 12 మంది సంఘం నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

గోడ ధ్వంసం చేసిన ముగ్గురిపై..

రాయికల్ : రాయికల్ పట్టణంలోని మోర హన్మాండ్లు చెందిన సర్వేనెంబర్ 626లో గురువారం రాత్రి గోడతో పాటు ఫెన్సింగ్ ధ్వంసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం బందెల అనిల్, అలిశెట్టి రాజేశ్, హరీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

చెరుకు తోటను దగ్ధం చేసిన వారిపై..

రాయికల్ : మండలంలోని సింగరావుపేట గ్రామం.. గాజర్ల రవికి చెందిన మూడెకరాల 20 గుంటల చెరుకు తోటను అదే గ్రామానికి చెందిన తక్కల రాజేశ్వర్‌రెడ్డి, అరిపెల్లి గంగరాజు దగ్ధం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పుల బాధతో రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో శుక్రవారం ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన దుబ్బెడ మల్లయ్య (58) తన పొలం వద్ద గురువారం రాత్రి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మల్లయ్యకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి పెళ్లిళ్లకు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. అంతేకాకుండా ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి తనకున్న ఎకరం భూమిలో సాగు చేసిన వరిపంట నేలరాలింది. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక, పంటనష్టం జరగడంతో మనోవేదనకు గురైన మల్లయ్య గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన మల్లయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.